తెలంగాణ ఖనిజం ఆంధ్రాకు

- మానుకోటలో ఆగని బెరైటీస్ అక్రమ రవాణా
- అర్ధరాత్రి తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం శేరిపురం, కోట్యాతండా వద్ద ఉన్న బెరైటీస్ కొండలు

మహబూబాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): విలువైన ఖనిజ సంపదపై అక్రమార్కులు కన్నేశారు. రాత్రికి రాత్రే బెరైటీస్‌ను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం శేరిపురం, పోచారం రిజర్వు ఫారెస్టులో బెరైటీస్ మైనింగ్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాత్రయితే చాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముఠాలు, ట్రాక్టర్లు, యంత్రాలతో ఇక్కడ వాలిపోతున్నాయి. బెరైటీస్‌ను తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. బెరైటీస్‌కు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గార్ల మండలంలో సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న బెరైటీస్ గనుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నాయి. మండలంలోని కోట్యానాయక్ తండా, బాలాజీ తండా, పాత పోచారం, నగరంలో బెరైటీస్ గనుల నిల్వలు వందల ఎకరాల్లో ఉన్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గనులను లీజుకు ఇవ్వగా, ఆంధ్రాకు చెందిన ఓ మైనింగ్ కంపెనీ బెరైటీస్ గనుల లీజు పొంది యథేచ్ఛగా తరలించుకుపోయింది. అనుమతులకు మించి తవ్వకాలు జరిపి ఆంధ్రప్రదేశ్‌కు తరలించారు. 2008లో అనుమతులు పొందిన ఒక ప్రైవేట్ కంపెనీ ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టింది. 2014లో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెరైటీస్ అనుమతి రద్దుచేసి మైనింగ్ తవ్వకాలను పూర్తిగా నిలిపివేసింది. తెలంగాణ ఖనిజాన్ని బయటి రాష్ట్రాలకు పోనిచ్చేది లేదని కేసీఆర్ పూర్తి స్థాయిలో అడ్డుకున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ అక్రమ దందాకు కాంగ్రెస్ నాయకులు తెరలేపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ముఖ్య నాయకుడి చొరవతో మళ్లీ బెరైటీస్‌ను అక్రమంగా తవ్వి అర్ధరాత్రి వేళల్లో తరలిస్తున్నారు. బెరైటీస్‌కు అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యతను బట్టి టన్నుకు గ్రేడ్-ఏకు రూ.25 వేలు, గ్రేడ్-బీకి రూ.15 వేలు, గ్రేడ్-సీకి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర పలుకుతున్నట్టు సమాచారం. పెట్రోల్ ట్యాంకుల నిర్మాణం, పరికరాల తయారీలో బెరైటీస్‌ను వినియోగిస్తారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమంగా బెరైటీస్ తరలింపు ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ముందుగా ట్రాక్టర్ల ద్వారా ఖనిజాన్ని ఒక చోటకు చేర్చి లారీల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో లారీలో 35 టన్నుల బెరైటీస్ ఖనిజాన్ని తరలిస్తున్నారు. టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల చొప్పున 35 టన్నులకు సుమారు రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అటవీ అధికారులు కందకాలు తవ్వినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ఇటీవల ఖనిజాన్ని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై గార్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈనెలలోనే ఒక ట్రాక్టర్ తీసుకెళ్తున్న సమయంలో ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాక్టర్ దిగబడటంతో ఖనిజాన్ని అక్కడే అన్‌లోడ్ చేసి అక్రమార్కులు పరారయ్యారు.

పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం

గార్ల మండలం కోట్యానాయక్ తండా, బాలాజీనాయక్ తండా సమీపంలోని కంపార్ట్‌మెంట్ నంబర్ 42, 43,44వ అటవీ ప్రాంతంలో బైరైటీస్ ఖనిజం ఉన్నది. ఖనిజం తరలింపు జరుగుతుందనే సమాచార నేపథ్యంలో అటవీశాఖ సిబ్బందితో పది బృందాలను ఏర్పాటు చేశాం. గుట్టల చుట్టూ స్థానికులతోపాటు మా బృందాలతో 24 గంటల నిఘా ఏర్పాటు చేశాం. ఖనిజ తరలింపునకు వీలు లేకుండా బైరైటీస్ ఉన్న ప్రాంతం చుట్టూ కందకాలు తవ్వించాం. పెద్ద కందకాలు తవ్వేందుకు అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. అనుమతి రాగానే చుట్టూ పెద్ద పెద్ద కందకాలు తీస్తాం. గతంలో ఖనిజాన్ని తరలించేందుకు లోపలికి వెళ్లిన ట్రాక్టర్‌ను సీజ్ చేశాం. ఖనిజం తరలిపోకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశాం.

- రమేశ్, డిప్యూటీ రేంజ్ అధికారి

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	44.6°c	29.8°c
మెదక్	44.4°c	26.2°c
నల్లగొండ	43.8°c	22.9°c
రంగారెడ్డి	43.0°c	25.6°c
నిజామాబాద్	42.2°c	29.8°c
కరీంనగర్	42.0°c	32.0°c
వరంగల్	41.0°c	31.0°c
హైదరాబాద్	40.2°c	27.3°c
మహబూబ్‌నగర్	40.1°c	28.4°c
ఖమ్మం	39.0°c	29.0°c

ఆలయ భూముల్లో వ్యాపారం

- వాణిజ్య అవసరాలకు వినియోగం
- పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు..
- పడావు భూముల్లో సౌర ఫలకాల ఏర్పాటు
- మారుమూల ప్రాంతాల్లో వ్యవసాయం
- దేవాదాయ శాఖ ప్రతిపాదనలు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ఆదాయం సమకూర్చుకునే మార్గాలపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. దేవాదాయ శాఖ భూములను వాణిజ్య అవసరాలకు కేటాయించాలని నిర్ణయించింది. రోడ్ల వెంట ఉన్న భూముల్లో హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని, 35కేవీ సబ్ స్టేషన్లకు దగ్గరగా ఉన్న భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి ఫలకలు అమర్చాలని, మారుమూల ప్రాంతాల భూముల్లో వ్యవసాయాన్ని కొనసాగించాలని దేవాదాయ శాఖ ప్రతిపాదించింది.

482ఆలయాలు.. 28,341 ఎకరాలు

పది ఉమ్మడి జిల్లాల పరిధిలో దేవాదాయ శాఖ ఆధీనంలో 482 ఆలయాలుండగా, 28,341ఎకరాల భూములున్నాయి. వీటిపై ఏటా రూ. 20కోట్ల లోపే ఆదాయం వస్తున్నది. 5వేలకు పైగా ఎకరాలపై కేసులున్నాయి. దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు కొనసాగుతుండడంతో ఎలాంటి ఆదాయం సమకూరడం లేదు. కౌలు ధరలు కూడా అనేక దశాబ్దాలుగా సవరించకపోవడంతో అరకొర ఆదాయమే వస్తున్నది. అందుబాటులో ఉన్న భూముల నుంచే సాధ్యమైనంత ఎక్కువ ఆదాయం పొందాలని నిర్ణయించారు. వ్యవసాయ, వాణిజ్య, పడావు భూములుగా విభజించి వాటి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు. పలు జిల్లాల్లో ప్రధాన రహదారుల వెంట భూములుండగా, వాటిని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. వీటిని షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు వినియోగించుకోవచ్చని ఆ శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. వాటిని గుర్తించి ప్రతిపాదనలు రూపొందించి, టెండర్ల పద్ధతిలో లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు.

ముందుగా ఐదు జిల్లాల్లో సౌర ఫలకాలు

పడావు భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్కో) ముందుకొచ్చింది. 700 ఎకరాలకుపైగా పడావు భూములున్నట్టు అధికారులు గుర్తించారు. ముందుగా 35కేవీ సబ్‌స్టేషన్లకు దగ్గరగా ఉన్న భూముల్లో సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని టీఎస్ రెడ్కో నిర్ణయించింది. నల్లగొండ, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో 219ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ భూముల్లో సౌరఫలకాలతో ఉత్పత్తయ్యే విద్యుత్ ద్వారా సమకూరే ఆదాయాన్ని చెరిసగం తీసుకోవాలని నిర్ణయించారు.

ఇంజినీర్ బాలరెడ్డికి శంకర రత్న అవార్డు

హైదరాబాద్, మే 26(నమస్తే తెలంగాణ): అమెరికాలో స్థిరపడ్డ తెలంగాణ ఇంజినీర్ బాలరెడ్డి ఇందుర్తి(బాలకిష్టారెడ్డి)ని ప్రతిష్టాత్మక శంకర రత్న అవార్డు వరించింది. ఆయన సమాజసేవను గుర్తిస్తూ ఆదివారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ శంకరరత్న-2023అవార్డుతో సత్కరించారు. మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, శంకర నేత్రాలయ చైర్మన్ టీఎస్ సురేంద్రన్, ఎంఆర్‌ఎఫ్ ప్రెసిడెంట్ గిరీష్‌రావు, కార్యదర్శి జీ. రామచంద్రన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకర నేత్రాలయ యూఎస్‌ఏ అధ్యక్షుడిగా బాలరెడ్డి తమ ట్రస్టు సేవలను అమెరికా అంతటా విస్తరించారు. అడాప్ట్ ఏ విలేజ్ పేరుతో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ క్యాంపులను నిర్వహించి ఆదరణ పొందారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని డిండి చింతపల్లి గ్రామానికి చెందిన బాలరెడ్డి తమ సొంత గ్రామంలోనూ మొబైల్ ఐ సర్జికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. బాలరెడ్డి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డికి సోదరుడు కావడం విశేషం.

కెమిస్ట్రీ ప్రశ్నలే కీలకం

పేపర్ -1తో పోల్చితే పేపర్ -2 కఠినం • జూన్ 9న జేఈఈ ఫలితాల విడుదల

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు జూన్ 9న విడుదలకానున్నాయి. జాతీయంగా ఆదివారం ఈ పరీక్షను నిర్వహించగా, తెలంగాణ నుంచి 24వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి సెషన్‌తో పోల్చితే రెండో సెషన్‌లో ప్రశ్నలు అత్యంత కఠినంగా ఇచ్చారు. ఈసారి కెమిస్ట్రీ ప్రశ్నలు ఛేదించిన వారు మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశముందని నిపుణులు విశ్లేషించారు. జనరల్ కటాఫ్ 80-90 మార్కులొండచ్చని తెలిపారు. మెయిన్స్ సిలబస్‌లో నుంచి తొలగించి అడ్వాన్స్‌డ్‌లో కొనసాగించిన సిలబస్ నుంచి ప్రశ్నలొచ్చాయని పేర్కొన్నారు. 200 మార్కులొస్తే 5వేల లోపు ర్యాంకు వచ్చే అవకాముందని తెలిపారు.

31న రెస్పాన్స్‌షీట్ల విడుదల

ఇక గణితం, ఫిజిక్స్‌లో ప్రశ్నలు చదివేందుకు విద్యార్థులు కష్టపడ్డారు. పేపర్-1లో ప్రశ్నల సరళి మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నట్టుగా తెలిపారు. గణితం ప్రశ్నలు సులభం నుంచి మధ్యస్థంగా ఉండగా, కెమిస్ట్రీ మధ్యస్థంగా, ఫిజిక్స్ కాస్త కఠినంగా ఇచ్చినట్టు విద్యార్థులు చెప్పారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలొచ్చాయి. ఎన్సీఈఆర్టీ సిలబస్ నుంచే అధికంగా ప్రశ్నలిచ్చారు. కెమికల్ కైనటిక్స్, కెమికల్ ఈక్విలిబ్రియం, అటామిక్ స్ట్రక్చర్, థర్మోడైనమిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలొచ్చాయి. పేపర్ -2లో గణితం ప్రశ్నలు పొడవుగా ఇచ్చారు. కానీ ప్రశ్నలు మధ్యస్థంగానే ఉన్నాయి. కెమిస్ట్రీలో థర్మోడైనమిక్స్, కైనటిక్స్, మెటలర్జీల నుంచి ప్రశ్నలిచ్చారు. ఇక ఆర్గానిక్ కెమిస్ట్రీ ప్రశ్నలు నేరుగా ఇవ్వడం విద్యార్థులకు సులభమైంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్‌షీట్లను ఈనెల 31న విడుదలచేస్తారు. జూన్ 2న ప్రొవిజినల్ ఆన్సర్‌కీని విడుదలచేస్తారు. విద్యార్థులు జూన్ 3 వరకు అభ్యంతరాలు వ్యక్తంచేయవచ్చు.

ఒక్కో సబ్జెక్టులో ప్రశ్నల సరళి (ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితంలలో)

సెక్షన్	ప్రశ్నతీరు	ప్రశ్నలసంఖ్య	మార్కులు	నెగెటివ్ మార్కులు	మొత్తం మార్కులు
సెక్షన్ -1	ఒకే సమాధానం	4	3	1	12
సెక్షన్ -2	రెండింటి కంటే ఎక్కువ ఆన్సర్లు	3	4	2	12
సెక్షన్ -3	నాన్ నెగెటివ్ ఇంటిగ్రేటెడ్	6	4	0	24
సెక్షన్ -4	మ్యాచింగ్	4	3	1	12
మొత్తం		17			60

కటాఫ్ 80 -90 మార్కుల వరకు ఉండొచ్చు

పేపర్ -1తో పోల్చితే పేపర్ -2 కాస్త కఠినంగా ఉంది. రెండు సెషన్లల్లో ఒకటి రెండు ప్రశ్నలు తడబడేవిగా ఉన్నాయి. గణితంలో కొన్నిప్రశ్నలు, ఫిజిక్స్‌లో ఒకటి రెండు ప్రశ్నలు పొడవుగా ఇచ్చారు. దీంతో విద్యార్థుల సమయం వృథా అయ్యింది. ఈ సారి జనరల్ కేటగిరి 80-90 మార్కుల వరకు ఉండొచ్చు.

- ఉమాశంకర్, శ్రీచైతన్య ఐఐటీ ఆలిండియా కో-ఆర్డినేటర్

బావమరిది కోసం మోకాళ్లపై బావ నడక

ఐనవోలు మల్లన్నకు మొక్కు చెల్లింపు

ఐనవోలు, మే 26: 'ఎవరికేమైతే నాకేంటి.. నేను బాగుంటే చాలు' అనుకునే ఈ రోజుల్లో.. అయిన వారు, కన్నవారి పట్ల విపరీత బుద్ధులను ప్రదర్శించి.. బంధాలు, బంధుత్వాలను తెంచుకుంటున్న ప్రస్తుత సమాజంలో.. ఓ మేన బావ మానవత్వం చాటాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తన బావమరిది క్షేమం కోరి మోకాళ్లపై నడిచి వెళ్లి ఐనవోలు మల్లన్నకు మొక్కు చెల్లించాడు. ఈ అపురూపమైన దృశ్యం ఆదివారం ఐనవోలులో ఆవిష్కృతమైంది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన చింతకాయల నాగరాజు మేన బావ మరిది గంధసిరి రజినీకాంత్ ఈ నెల 17న అరెపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయమై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తన బావమరిది కోలుకుంటే మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి ఐనవోలు మల్లన్నకు మొక్కు చెల్లించుకుంటానని రజినీకాంత్ ప్రమాదానికి గురైన రోజే మొక్కుకున్నట్టు నాగరాజు వెల్లడించాడు. మల్లికార్జునస్వామి ఆశీస్సులతో తన బావమరిది ఎలాంటి ప్రాణహాని లేకుండా బయటపడ్డాడని, ఈ మేరకు ఆదివారం ఉదయం అంబాల నుంచి ఐనవోలుకు మోకాళ్లపై నడుచుకుంటూ మల్లికార్జునస్వామి సన్నిధికి చేరుకుని మొక్కు చెల్లించినట్టు తెలిపాడు. భక్తి శ్రద్ధలతో మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించిన నాగరాజును ఈవో అద్దంకి నాగేశ్వర్, అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు. స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈవో మాట్లాడుతూ.. ఐనవోలు మల్లికార్జునస్వామి భక్తులు కోరిన కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడని తెలిపారు.

విష్ణుపురం వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వే స్టేషన్ వద్ద పట్టాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దామరచర్ల, మే 26: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం విష్ణుపురం రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు ఆదివారం పట్టాలు తప్పింది. సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ఖాళీ గూడ్స్ రైలు.. మధ్యాహ్నం 2:45 నిమిషాలకు విష్ణుపురం రైల్వేస్టేషన్ దాటగానే అకస్మాత్తుగా కుదుపునకు గురై ముందు భాగంలోని 6, 7 బోగీలు పట్టాలు తప్పి వంగిపోయాయి. గమనించిన లోకోపైలెట్ రైలును నిలిపివేసి స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు స్టేషన్ కావడంతో పరిసర స్టేషన్ల నుంచి రైల్వే అధికారులు, సిబ్బంది విష్ణుపురం స్టేషన్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గూడ్స్‌రైలు మెయిన్ ట్రాక్‌పై పట్టాలు తప్పడంతో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్లే ఇతర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. గుంటూరు నుంచి ఏఆర్‌టీ ప్రత్యేక వాహనాన్ని తీసుకొచ్చి పట్టాలు తప్పిన రెండు గూడ్స్ బోగీలను సరిచేసి గూడ్స్‌ను తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా.. గూడ్స్‌రైలు పట్టాలు తప్పడంతో అధికారులు అప్రమత్తమై మిర్యాలగూడ స్టేషన్‌లో శబరి, సికింద్రాబాద్ స్టేషన్‌లో పల్నాడు, రేపల్లె-నడికుడి స్టేషన్‌లో జన్మభూమి, గుంటూరు స్టేషన్‌లో నాగర్‌సోల్ రైళ్లను నిలిపివేశారు. సుమారు 6 గంటలపాటు రైళ్లను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పోలీసుల కొరడా

- సిరిసిల్ల జిల్లాలో ఏకకాలంలో దాడులు
- మూడు కేసులు నమోదు

సిరిసిల్ల పట్టణంలోని గల్ఫ్ ఏజెంట్ ఆఫీసులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల తెలంగాణ చౌక్, మే 26 : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లపై శనివారం రాత్రి ఏకకాలంలో దాడులు నిర్వహించినట్టు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్ల డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బృందాలుగా ఏర్పడి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ క్రమంలో తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన మహమ్మద్ మహబూబ్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బొండు అంజయ్య, గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ఓర గంటి లక్ష్మణ్‌ను నకిలీ ఏజెంట్లుగా గుర్తించి కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 43 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 19 కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయినా, డబ్బులు, పాస్‌పోర్టులు తీసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నా.. పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లే వారికి నకిలీ వీసాలు ఇచ్చి మోసాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్ల ద్వారానే వీసాలు పొందాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకునేందుకు పోలీస్‌శాఖను సంప్రదించాలని కోరారు.

శిలాఫలకం ధ్వంసం

- రాజకీయ కుట్ర ఉన్నట్టు అనుమానం

దుండగుల చేతిలో ధ్వంసమైన శిలాఫలకం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 26: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు ఎదుట ఉన్న శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. 2,087 ఎకరాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అతిపెద్ద పార్కుగా గుర్తింపు తీసుకొచ్చారు. శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా ఉన్న సమయంలో జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వైపు హైవే వెంట ఏర్పాటు చేసిన లైట్ల ప్రారంభోత్సవంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని పార్కు వద్ద ఆవిష్కరించారు. దానిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ధ్వంసం చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడి వేధింపులకు బాలిక ఆత్మహత్య

పాలకుర్తి, మే 26: యువకుడి వేధింపులతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల బీసీ కాలనీలో జరిగింది. బాలిక (16)ను పెద్దపల్లికి చెందిన శ్యాం కొంత కాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఎన్నిసార్లు వద్దని చెప్పినా వినకపోగా.. మరింత ఎక్కువగా వేధిస్తున్నాడు. దీంతో బాలిక తీవ్ర మనస్తాపానికి లోనై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్యాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

యువతి మోసం.. యువకుడి ఆత్మహత్య

నల్లగొండలో రైలు కిందపడి బలవన్మరణం
హనుమకొండ జిల్లా సోమిడిలో విషాదం

రాజ్‌కుమార్ (ఫైల్)

కాజీపేట, మే 26: ప్రాణంగా ప్రేమించిన యువతి మోసం చేసిందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం నల్లగొండలో వెలుగుచూసింది. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడికి చెందిన మంతుర్తి రమేశ్, రాజమ్మ దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ (28) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఏడేండ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. పని చేసే చోట పరిచయమైన అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. సూర్యాపేట జిల్లాకు చెందిన యువతి కుటుంబ సభ్యులకు.. ఇటీవలే వీరి ప్రేమ విషయం తెలియడంతో రాజ్‌కుమార్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దీంతో రాజ్‌కుమార్ ఎదురు తిరగగా అమ్మాయి బంధువులు సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అమ్మాయి బంధువులు చంపేస్తామని బెదిరించడంతో మనస్తాపం చెందిన రాజ్‌కుమార్.. ఏడేండ్లుగా సాగిన ప్రేమ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు బంధువులు, మిత్రులకు పంపించాడు. వెంటనే అప్రమత్తమైన స్నేహితులు, బంధువులు వెతకగా సూర్యాపేటలో దొరికాడు. రాజ్‌కుమార్‌కు ఎంత చెప్పినా తనకు ఆత్మహత్యే శరణ్యమని, తనను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేయించాలని అందరినీ మాటల్లో దించి అక్కడి నుంచి పరారయ్యాడు. సూర్యాపేటలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం నల్లగొండ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టుగా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. యువతి కుటుంబ సభ్యుల వేధింపుల వల్లే తమ కొడుకు చనిపోయాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

● గ్రూప్-1 ప్రిలిమినరీ వాయిదా లేదు: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేసే ప్రసక్తే లేదని టీఎస్‌పీఎస్సీ తేల్చింది. ఇప్పటికే పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు పేర్కొన్నది. జూన్ 9నే పరీక్ష నిర్వహించేందుకు జూన్ 1 నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొనే విధంగా చర్యలు తీసుకొన్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదలైన వెంటనే లోక్‌సభ ఎన్నికలొచ్చాయి. ఈ ఎన్నికల ప్రక్రియ ముగుస్తున్న నేపథ్యంలోనే ఖమ్మం-వరంగల్-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎన్నికలు వచ్చాయి. దీంతో గ్రూప్-1 కోసం దరఖాస్తులు చేసుకొన్న వారిలో నిరుద్యోగులతో పాటు ఇన్ సర్వీసు ఉద్యోగులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. ఇన్ సర్వీస్ ఉద్యోగులు ఎన్నికల డ్యూటీలలో తప్పనిసరిగా పాల్గొనాల్సి వచ్చింది. నిరుద్యోగులది కూడా అదే పరిస్థితి. ఎన్నికల వేళ ప్రిపేర్ కాలేదని, ప్రచారంలో పాల్గొన్న దాఖలాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈక్రమంలోనే ప్రిలిమినరీ పరీక్షలను కనీసం రెండు నెలలు వాయిదా వేసి, తమకు న్యాయం చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీలను గ్రూప్-1 అభ్యర్థులు కోరారు. గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిసి వినతి పత్రం అందజేశామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తెలిపారు. గ్రూప్-1 పరీక్షల పేరుతో గ్రాడ్యుయేట్లను పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయకుండా కాంగ్రెస్ కుట్రలు చేస్తుందని, ఈ విషయాన్ని గ్రహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఎన్నికల కమిషన్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్వీ నాయకులు బిల్లు నాగరాజు యాదవ్, నాగేంద్రరావు, అవినాష్, చిలుకల రాకేష్ ఉన్నారు.

● సెర్చ్ కమిటీ సమావేశాలకు కుదరని ముహూర్తం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు వర్సిటీలకు నూతన వైస్‌చాన్స్‌లర్లను ఎంపికచేసే సెర్చ్ కమిటీ సమావేశాలకు ముహూర్తం కుదరడం లేదు. దీంతో కొత్త వీసీల నియామకంపై సందిగ్ధత నెలకొన్నది. రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీల పదవీకాలం ఈ నెల 21నే ముగిసింది. వీసీల పదవీకాలం ముగియడానికి ముందే కొత్త వీసీలను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్